క్లుప్తంగా

అధ్యాపకురాలికి డాక్టరేట్



రావి స్రవంతి

కావలి రూరల్: పట్టణంలోని పీబీఆర్ విట్స్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకురాలు రావి స్రవంతికి అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీకాల్ యూనివర్సిటీ బుధవారం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఎఫీషియేంట్ ఇమేజ్ అనాలసిస్ ఫర్ విజన్ బేస్డ్ స్కిమ్మింగ్ ఆఫ్ ఫ్లోటింగ్ వీడ్స్ ఇన్ ఇన్ల్యాండ్ వాటర్ బాడీస్' అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ ఏఎస్‌వీశర్మ పర్యవేక్షణంలో అధ్యాయనం చేయడంతో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పలువురు అభినందించారు.

డీఎల్‌డీఓ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కనకదుర్గా భవాని

అల్లూరు: మండలంలోని ఇందుపూరు, పురిణి, గోగులపల్లి సచివాలయాలను కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయ సిబ్బంది హాజరుపట్టీలను, ప్రజలకు అందిస్తున్న సేవల రికార్డులను తనిఖీ చేశారు. ఆధార్ అప్‌డేట్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఎలా జరుగుతుందో అని ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

వరికుంటపాడు: మండలంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో క్షేత్ర సహాయకులు, మేట్‌లు కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు అన్నారు. ఆయన బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బంది, ఈసీ హజరత్‌తో సమీక్ష నిర్వహించారు. పంచాయతీల వారీగా ఉపాధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. కొలతల ప్రకారం పనులు కేటాయించి ప్రభుత్వం నిర్దేశించిన రూ.272 గిట్టుబాటు కూలీ అందేలా చూడాలన్నారు.

అంగన్‌వాడీల్లో సీమంతాలు



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఆత్మకూరు: ఆత్మకూరులోని హిల్‌రోడ్డు మేదరి వీధి కాలనీ క్లస్టర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు సీమంతాలు వేడుకగా నిర్వహించారు. సీడీపీఓ జైనకుమారి పర్యవేక్షణలో సూపర్‌వైజర్లు, ఆ క్లస్టర్ నిర్వాహకురాలు రమణమ్మ ఆధ్వర్యంలో నలుగురు గర్భిణులకు సీమంతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం ప్రదర్శన నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

• వ్యక్తికి తీవ్రగాయాలు



సంగం: బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని దువ్వూరు వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. స్థానికుల మేరకు నెల్లూరుకు చెందిన రఘునాథ్‌రెడ్డి తన బైక్‌లో ఆత్మకూరుకు వెళ్లి తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా దువ్వూరు వద్ద వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో రఘునాథ్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న వాహనదారులు కారును నిలిపి క్షతగాత్రుడిని ఎన్‌హెచ్‌వి పెట్రోలింగ్ వాహనంలో నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి ప్రమాదానికి కారణమైన కారును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు వేసవి ప్రోత్సాహకాలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలకు ప్రభుత్వం వేసవి ప్రోత్సాహకాలు అందజేస్తుందని మర్రిపాడు ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్ అన్నారు. మండలంలోని అల్లంపాడు, పొంగూరుకండ్రిక గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఏపీఓ సునీల్‌తో కలిసి ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతి కూలి తమ ఇంటి వద్ద నుంచి పనులకు వచ్చేటప్పుడు తాగునీరు వెంట తెచ్చుకుని తాగాలని సూచించారు. నిబంధనల ప్రకారం కొలతలకు అనుగుణంగా పనులు చేసి రూ.272 కూలి గిట్టుబాటయ్యేలా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతి, మేట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ

అంగన్‌వాడీ కేంద్రాల్లో గతానికి భిన్నంగా సంపూర్ణ పోషకాహారం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' పథకం ద్వారా ప్రభుత్వం సంపూర్ణ ఆరోగ్యం కోసం చేస్తోంది. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు గతంలో కొన్ని ఉదయగిరి, మరికొన్ని సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలోని సీడీపీఓల పర్యవేక్షణలో ఉండేవి. అయితే పాలనా సౌలభ్యం కోసం పోషకాహారం సకాలంలో ఆయా కేంద్రాలకు అందేందుకు వీలుగా మండలాలను ఆత్మకూరు పరిధిలోకి తెచ్చారు.

- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం
- అంగన్‌వాడీల్లో అందుబాటు
- పర్యవేక్షణ సౌలభ్యం కోసం కొత్త క్లస్టర్లు



అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పోషకాహార పదార్థాలు



పోషక పదార్థాలు ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

ఆత్మకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల వయసు నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం (చిరుధాన్యాలతో తయారైన పిండి) రెండున్నర కేజీలు, నెలకు 25 కోడిగుడ్లు, రోజుకు వంద ఎం.ఎల్ పాలు నెలంతా ఒకేసారి వారి తల్లులకు అందజేస్తున్నారు. నిత్యం అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం చిన్నారులకు ఆయాల ద్వారా తినిపిస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుంది. దీనికి తోడు క్లస్టర్ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా', 'సంపూర్ణ పోషణతో ఆరోగ్యం తథ్యం' అనే రెండు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు సీడీపీఓలు ఆయా క్లస్టర్ సూపర్‌వైజర్లతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు, ఆయాలకు అవగాహన కల్పిస్తూ సూచనలు ఇస్తున్నారు.

గర్భిణులు, బాలింతల పోషణ మెనూ

గర్భిణులకు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా 6 రకాల పౌష్టికాహారం నెలకు ఒకేసారి అందజేస్తున్నారు. అటుకులు ఒక కేజీ, సజ్జ/జొన్న పిండి ఒక కేజీ, రాగి పిండి కేజీ, వేరుశనగ పప్పు, బెల్లంతో చేసిన చిక్కి 250 గ్రాములు, ఎండు కర్జూరాలు 250 గ్రాములు, బెల్లం 250 గ్రాములు చొప్పున, వీటికి తోడు 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు గర్భిణులు, బాలింతలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రతిపాదించిన మెనూ మేరకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు.

కొత్తగా క్లస్టర్ మార్పులు

ఇటీవల వరకు ఆత్మకూరు సీడీపీఓ (చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) పరిధిలో ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాలు ఉండేవి. నియోజకవర్గంలోని చేజర్ల మండలం సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు సీడీపీఓ పరిధిలో, మర్రిపాడు మండలం ఉదయగిరి నియోజకవర్గంలోని సీడీపీఓ పరిధిలో, సంగం మండలం కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం సీడీపీఓ పరిధిలో ఉండేవి. తాజాగా ఆత్మకూరు సీడీపీఓ పరిధిలో ఆత్మకూరు, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం మండలాలు ఉండేలా, అనంతసాగరం క్లస్టర్‌లో మర్రిపాడు మండలాన్ని కలిపి ఆ రెండు మండలాలకు ప్రత్యేక సీడీపీఓను ఏర్పాటు చేశారు. పొదలకూరు ప్రాజెక్ట్‌ను రద్దు చేసి వెంకటాచలం క్లస్టర్‌కు కలిపారు. ప్రస్తుతం పాత పద్ధతి ప్రకారం కొనసాగుతున్న విధానం మేరకు ఆత్మకూరు క్లస్టర్ పరిధిలో 216 అంగన్‌వాడీ కేంద్రాలు, అనంతసాగరం పరిధిలో 164 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో అధికారిక లెక్కల ప్రకారం 9 వేల మంది చిన్నారులు, 1,800 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నట్లు సమాచారం.

ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతశిశు సంరక్షణకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నాయి. సంపూర్ణ ఆరోగ్యంతో భావితరాల పౌరులు ఉండేలా నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నాం. ఎప్పటికప్పుడు సరఫరా అయ్యే పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తూ ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహిస్తున్నాం. ఒకటి, రెండు చోట్ల ఆహార పదార్థాల్లో నాసిరకం కనుగొంటే ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. ప్రతి నెల సూపర్‌వైజర్లతో, అంగన్‌వాడీ నిర్వాహకులతో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నాం. మూడు నెలలకోమారు పౌష్టికాహార ప్రదర్శన, వాటి వల్ల చేకూరే లాభాలు గురించి వివరిస్తున్నాం.

– జైనకుమారి, సీడీపీఓ, ఆత్మకూరు.

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

ఉదయగిరి: మండలంలో రెండో విడతలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ సహాయకులు, పీఎంసీ కమిటీలు బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఎంపీడీఓ బిజాక్‌ప్రవీణ్ సూచించారు. ఆయన బుధవారం మండలంలోని ఇంజినీరింగ్ సహాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 25 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం జరుగుతున్న రూ.10.48 లక్షల విలువ చేసే 23 రకాల పనులను పరిశీలించాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలన్నారు. పనులకు సంబంధించి ఫొటోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేసి పాఠశాలలను సిద్ధం చేయాలన్నారు.

దాతలకు సన్మానం



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో తమవంతు సహకారం అందించిన దాతలను బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. మర్రిపాడు మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, పెగళ్లపాడు సర్పంచ్ ప్రణవీశ్రీనివాస్‌తో పాటు మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, ఎంఈఓ మాలకొండయ్యను ఈ సందర్భంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. హెచ్‌ఎం శివజ్యోతి, ఉపాధ్యాయులు వెంకటయ్య, కలిశెట్టి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పథకాలు

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



జువ్వలదిన్నెలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి/ బిట్రగుంట: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాల అమల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. కావలి పట్టణం 38వ వార్డులో, బోగోలు మండలం జువ్వలదిన్నెలో ఎమ్మెల్యే బుధవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య ఉన్న తేడాలను వివరించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అమలు చేసిన పథకాలు, పేదల జీవితాల్లో వచ్చిన మార్పులపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు ప్రత్యక్షంగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పేరుతో పేదల కష్టాలు తొలగించే పథకాలు ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసిన ప్రతి పథకం అర్హుల చెంతకు చేరేలా వలంటీర్ల వ్యవస్థను, గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నేరుగా పేదల ఇళ్ల ముంగిటకే పథకాలు తీసుకువెళ్తున్నట్లు వివరించారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి లబ్ధి కలిగించేలా సచివాలయాల ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతున్నట్లు వివరించారు. పథకాల ద్వారా లబ్ధిదారులకు ఎంత మేరకు లబ్ధి చేకూరిందనే వివరాలు కూడా సచివాలయాల ద్వారా పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. సచివాలయాలు మాత్రమే కాకుండా రైతు భరోసా కేంద్రాలు, నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, ఫ్యామిలీ డాక్టర్ తదితర పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు.

రీసర్వేలో లోపాలు ఉండకూడదు

• జేసీ కూర్మనాథ్

చేజర్ల: భూముల రీసర్వేలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అన్నారు. బుధవారం చేజర్ల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కువ భూమి సర్వే చేయాల్సి ఉన్నందున రీసర్వే చేసే విషయంలో సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు చేశారు. రీసర్వే అత్యంత కచ్చితత్వంగా జరగాలని, అసలైన భూయజమానులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేసే విషయంలో ఎటువంటి నిర్లక్షాన్ని సహించబోమని తెలిపారు. భూమికి అసలైన యజమానులను గుర్తించి సెంటు భూమి కూడా నష్టపోకుండా యజమానులకు హక్కులను నిర్ధారించాలన్నారు. తద్వారా అపరిష్కృతంగా రెవెన్యూ సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధాన్యం అమ్ముతున్న రైతులను గిట్టుబాటు ధర విషయాన్ని అడిగారు. ఏవైనా సమస్యలు ఉన్న పక్షంలో పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మొలతాటి గిరీష్, డీటీ విజయ్ పాల్గొన్నారు.

జగన్ అంటేనే నమ్మకం



జలదంకిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వంటేరు, నాయకులు



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మెట్టుకూరి చిరంజీవిరెడ్డి

జలదంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే నమ్మకం అని, అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాడని కావలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ సలహా కమిటీ సభ్యుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జలదంకి, బ్రాహ్మణక్రాక సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జలదంకి పోలేరమ్మ తల్లి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. జలదంకి బస్టాండ్ సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పొలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, నాయకులు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, కోర్శిపాటి రామిరెడ్డి, సురే వెంకటశేషారెడ్డి, రావి ప్రసాద్, సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, గుర్రం జగ్గయ్యనాయుడు, దేవరపల్లి మధుసూదన్‌రెడ్డి, బ్రాహ్మణక్రాక సర్పంచ్ ఇండ్ల సుధాకర్ పాల్గొన్నారు.

పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పాలన

వింజమూరు (ఉదయగిరి): పేదరికమే ప్రామాణికంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి అన్నారు. మండలంలోని మాధవనగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న ముఖ్యమంత్రి జగనన్నే మా భవిష్యత్తు అని ప్రతి ఒక్కరూ నినదిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వి.సుబ్బారెడ్డి, పల్లాల కొండారెడ్డి, తాటిచెట్ల కాలేషా, కాటం రమణారెడ్డి, హజరత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే జగనన్న ధ్యేయం

దుత్తలూరు: రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించటమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం దుత్తలూరు ఏఏ కాలనీలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని సర్పంచ్ యనమల సుబ్బమ్మతో కలిసి నిర్వహించారు. సచివాలయ కన్వీనరు యనమల బాలాజీ, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాలు

ఆత్మకూరు: రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అర్హులు అందరికీ అందజేస్తున్నారని నాయకులు వివరించారు. మున్సిపల్ పరిధిలోని 1, 7, 10, 11, 13 వార్డులలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు మొలబండి రాజశేఖర్, సయ్యద్ నౌషాద్‌బేగం, తుమ్మల త్రివేణి, గుడి సంధ్య, టి.తిరుపతమ్మ, నాయకులు దిలీప్‌కుమార్, బి.వెంకటకృష్ణారెడ్డి, అల్లంపాటి రమేష్‌రెడ్డి, కె.నాగరాజు, సురేష్ యాదవ్, టి వెంకటేశ్వరు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు

సంగం: మండలంలో ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందచేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి ఇంటికి స్టిక్కర్లు అతికించారు. జెండాదిబ్బ గ్రామంలో శంకరయ్య ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన వెంట సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఉన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు పరీక్షలు

సీతారామపురం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు గురువారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు సీబీఏ-3, ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశ్నపత్రాలను ఏ రోజుకా రోజు పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాలన్నారు. పరీక్షలు ముగిసిన మరుసటి రోజే జవాబు పత్రాలు మూల్యాంకనం చేయాలన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్ష

చేజర్ల: మండలంలోని యనమదల సచివాలయంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వంపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ విజయలలిత మాట్లాడుతూ గ్రామంలో భూములకు సంబంధించిన రెవెన్యూ సమస్యలు ఉన్నాయని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని పరిష్కరించాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలన్నారు. ప్రతి ఒక్కరూ అటెండెన్స్‌ను పాటించాలన్నారు.

23న ప్రవేశ పరీక్ష

సంగం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ప్రవేశ పరీక్షను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వై.మహాలక్ష్మి తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావాలని, విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ జెరాక్స్, పెన్ను తీసుకుని పరీక్ష కేంద్రానికి రావాలన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని, విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించండి

సంగం: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేనేత ఐక్యవేదిక సంఘం జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున కోరారు. సంగం కొత్తూరులో బుధవారం రాష్ట్ర చేనేత ఐక్యవేదిక పర్యటనలో భాగంగా బుధవారం చేనేత కార్మికులతో సమావేశం జరిగింది. జాతీయ కార్యవర్గ సభ్యుడు సుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు రామదాసు, ప్రధాన కార్యదర్శి చింతా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారి పరిస్థితి చూసి చలించిన ఎమ్మెల్యే



చిన్నారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: పుట్టుకతోనే శారీరక, మానసిక వైకల్యంతో మంచానికే పరిమితమైన ఓ ఐదేళ్ల చిన్నారి నీలిమా పరిస్థితిని చూసి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చలించిపోయారు. బోగోలు మండలం జువ్వలదిన్నెలో బుధవారం రాత్రి గడపగడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిన్నారి విషయాన్ని తెలుసుకుని తల్లిదండ్రులు డేగా విజయకుమార్, కల్పనతో మాట్లాడారు. చిన్నారికి వైద్యం చేయించేందుకు ఉన్న అవకాశాలపై డీఎంహెచ్‌ఓ పెంచలయ్యతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వైద్యానికి సాయం అందేలా చూస్తానని చెప్పారు. తక్షణంగా చిన్నారికి పింఛన్ మంజూరు అయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చొరవపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

సంక్షేమానికి ప్రజలంతా అండ

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



చుంచులూరులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ వర్గాల వారికి అందజేసిన కొండంత సంక్షేమ పథకాలకు లబ్ధిదారులైన పేదలంతా సంతోషంగా ఉన్నారని, వారంతా ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చుంచులూరులో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చుంచులూరులో రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించి దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గడపగడపకు తిరిగి ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటికి అందించిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా చుంచులూరులో వ్యవసాయ, గృహ, విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాలి వెంగయ్య బృందం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని కలిసి సోమశిల హైలెవల్ కెనాల్ పనుల్లో తొలిదశలో పడమటినాయుడుపల్లి వద్ద కేతామన్నేరు వాగుపై నిర్మించాల్సిన మొదటి రిజర్వాయర్ పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. భూసేకరణ పనులు కొలిక్కి రాకపోవడంతో ఐదేళ్ల క్రితం కొన్నిచోట్ల పైపులైన్లు, పంపు షెడ్లు నిర్మించినా అవి కూడా శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉందన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి సోమశిల జలాశయం నాలుగేళ్ల వరసగా నీటి నిల్వలతో తొణికిసలాడుతుందని, అందుకు తగ్గట్టు హైలెవల్ కెనాల్ పనులు కూడా వేగవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ చీలపోగు చాముండయ్య, నాయకులు కోనంకి శ్రీనివాసులునాయుడు, భేరి బ్రహ్మానందరెడ్డి, ముటుకుంది లక్ష్మీరెడ్డి, చెవుల శ్రీనివాస్, బాలాజీ, సుబ్రహ్మణ్యం, ఇందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, దువ్వూరు రవికుమార్, బత్తలపల్లి రోశిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బసవరాజుపాళెం రోడ్డుకు మహర్దశ



బసవరాజుపాళెం రోడ్డుకు యంత్రాల సాయంతో తారు రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: మండలంలోని బసవరాజుపాళెం రోడ్డుకు మహర్దశ పట్టింది. 3.55 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రోడ్డు కరటంపాడు వద్ద 67వ నంబరు జాతీయ రహదారి నుంచి మహిమలూరు చెరువు గట్టు మీదుగా వెళ్తోంది. ఇటీవల కాలంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రూ.1.05 కోట్ల నిధులు మంజూరు చేయడంతో పంచాయతీరాజ్‌శాఖ టెండరు ద్వారా నిర్మాణ పనులు చేపట్టింది. బుధవారం పనులు ప్రారంభించారు. దీంతో మహిమలూరు, రామస్వామిపల్లి, దేవూరు ప్రజలు 67వ నంబరు జాతీయ రహదారి వైపు రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమం అయింది. అయితే బసవరాజుపాళెం సమీపంలో మహిమలూరు చెరువు కలుజుపై రోడ్డుకు అడ్డంగా నిర్మించిన వంతెన వద్ద నూతన రోడ్డు నిర్మించకపోవడంతో మరికొంత అసౌకర్యంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదే విషయమై పంచాయతీరాజ్ శాఖ పీఐయూ విభాగం ఏఈఈ ఉమామహేశ్వరరావును సంప్రదించగా కలుజుపై రాకపోకలకు అనువుగా నూతన వంతెనతో పాటు అప్రోచ్‌రోడ్డు నిర్మించాల్సి ఉందని, ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే పూర్తిస్థాయిలో బసవరాజుపాళెం రోడ్డు వైపు రాకపోకలు సౌకర్య వంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కోవిడ్‌పై అవగాహన తప్పనిసరి



ఆత్మకూరు: కోవిడ్ మహమ్మారి తిరిగి విస్తరిస్తున్న క్రమంలో దానిపై పూర్తి అవగాహన కలిగి సక్రమించకుండా జాగ్రత్తలు వహించాలని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం అన్నారు. ఆస్పత్రిలో బుధవారం కోవిడ్-19, హెచ్3, ఎన్2 వైరస్‌తో పాటు ఇటీవల సంక్రమిస్తున్న జ్వరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. డాక్టర్ శేషారత్నం మాట్లాడుతూ మాస్క్ ధరించడం, భౌతిక దూరం పాటించడం, చేతులు శుభ్రం చేసుకోవడం పాటించాలన్నారు. ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ హెచ్ 3, ఎన్ 2 వైరస్‌వ్యాధి తీవ్రతను పెంచుతుందని, దీనిని నివారించేందుకు పాటించాల్సిన నియమాలు వివరించారు. ఈ వైరస్ వల్ల ఒక్కోసారి మరణం సంభవిస్తుందని తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ మునికృష్ణ, డాక్టర్లు ప్రవల్లిక, నదియా, ఏఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందికి శిక్షణ

ఆత్మకూరు: పొదుపు ఏపీఎంలు, సీసీలు, వీఓఏలకు పొదుపు గ్రూపుల నిర్వహణ, రుణాల రికవరీ, తదితర అంశాలపై మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏరియా కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు చెందిన 12 మండలాల ఏపీఎంలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. ఒక్కో మండలానికి ఒక ఏపీఎం, ఇద్దరు సీసీలు, ఇద్దరు వీఓఏలకు ఈ ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని టీఓటీలుగా తయారు చేయనున్నట్లు ఏసీ వెంకటేశ్వర్లు తెలిపారు. శిక్షణ పొందిన ఈ టీఓటీలు ఆయా మండలాల్లో పొదుపు సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. ట్రైనర్, ఐబీపీఎం కె.కాంతారావు, పి.చిన్నయ్య మాట్లాడుతూ పొదుపు గ్రూపులను సక్రమంగా నిర్వహించి ఎందరో మహిళలు ఆర్థికంగా స్థిరపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకుని ఇతర గ్రూపుల్లోని పొదుపు మహిళలు ఆర్థిక పురోగాభివృద్ధి సాధించాలని కోరారు. ఆత్మకూరు ఏపీఎంలు బి వెంకమ్మ, మోహన్‌రావు, హరి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభోత్సం సందర్భంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.

కలిగిరి: మండలంలోని 14వ మైలు సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉందన్నారు.